

# అనుక్షణం

## - సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(గతసంచిక తరువాయి)

**బెంగళూరులో** వెంకటాద్రి దగ్గరకు ఆదిత్య వచ్చాడు.

అప్పుడు తను చెప్పాలనుకున్నది చెప్పి నిరంజన్ ప్రపోజల్ గురించి చెప్పాడు. ఆదిత్య విన్నాడు. తను ఆలోచనలో పడ్డాడు.

"మీరు ఏమనుకుంటున్నారు నాన్నా" అని అడిగాడు.

"ఇందులో నాదేం లేదని ముందే చెప్పాను".

"ఓ అభిప్రాయంగా అడుగుతున్నాను".

"మీ జనరేషన్ వేరు. నాకు జాబ్ రాగానే తృప్తిపడ్డాను. కొంతమంది ఉద్యోగం చేస్తూనే చదువుకున్నారు. కొత్త అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లారు. అలాగే ఓ మిత్రుడికి నటన మీద దృష్టి వుంది. అతనికి అప్పటికే పెళ్లి అయింది కూడా. అయినా అతను రిస్క్ తీసుకుని ఉద్యోగం నుండి వెళ్లిపోయాడు".

"ఎవరు నాన్నా అతను?"

"అతను పెద్దగా సక్సెస్ కాలేదు. చిన్న చిన్న పాత్రల్లో సినిమాల్లో కనిపించాడు. ఇప్పుడు టీ.వీ.ల్లో యాక్ట్ చేస్తున్నాడు. ఈ మధ్య కనిపించాడు. నువ్వు ఉద్యోగం మానేసినందుకు బాధ పడుతున్నావా అని అడిగాను. అదేం లేదు. నేను ఇష్టపడి వెళ్లాను. ఆఫీస్ లోనే పని చేస్తుంటే అనామకుడిగా మిగిలిపోయేవాడిని. ఇప్పుడు నన్ను జనం గుర్తుపడుతున్నారు. కొద్ది మంది అయినా అభిమానులున్నారు. ఇక్కడ టాలెంట్ తోపాటు అదృష్టం వుండాలి. నాకు ఏదొక రోజు మంచి అవకాశం వస్తుంది. ఒక్క రెండు సంవత్సరాలు చాలు. నేను ఆర్టిస్ట్ గా వెలిగిపోతాను. ఈ రంగం గురించి తెలిసిందే కదా. ఒక్కోసారి అరవైల్లోకి ఎంటరవుతున్నప్పుడు అదృష్టం పలకరిస్తుంది అన్నాడు".

"అలాంటి కాన్ఫిడెన్స్ లేకపోతే కష్టం. నిరంజన్ గారు నన్ను ఇండస్ట్రీ పెట్టాలని వుందా అని అడిగారు. జనరల్ గా అడుగుతున్నారనుకున్నాను. నాకు జాబ్స్ చేయాలని లేదు నాన్నా. మనం నలుగురికి పనులు ఇవ్వగలగాలి అని నా

మనసులో వుంది. అలా అని మనకున్న ఆర్థిక యిబ్బందులు నాకు తెలుసు. అందుకే అవసరాన్ని బట్టి జాబ్ చేయాలి అనుకున్నాను. తర్వాత లైక్ మైండెడ్ ఫ్రెండ్స్ ని కలుపుకుని ఏదన్నా చేయాలని అనుకున్నాను''.

''అలానే జరిగిందనుకుందాం. అప్పుడు నష్టాలు వస్తే?''

''రావటానికి అవకాశం వుంటుంది. అదే సమయంలో లాభాలు కూడా రావచ్చు. రావాలనే కదా ఎవరయినా వ్యాపారాలు మొదలు పెడతారు. మనం ఆ పరిస్థితులను బట్టి రియాక్టవాలి''.

''అంటే.... ''

''మనకి రాత్రికి రాత్రి నష్టాలు రావు నాన్నా... అది స్పెక్యులేషన్ బిజినెస్. మనకి పరిస్థితి తెలుస్తుంటుంది. అందుకని ఇది తాత్కాలికమా, కంటిన్యూ అవుతుందా అనేది పరిశీలించి వైండప్ చేయాలి. అలాగే నా ఇగోస్. మనం అవసరమైతే జాబ్ చేయాలి. చిన్న వ్యాపారాలు చేయాలి. అయినా చదువుకున్నాం కాబట్టి అసలు బతకకపోవటం వుండదు. జనం మనల్ని చూసి నవ్వుతున్నారు అని బాధ పడకూడదు. జనం పని నవ్వటం, ఏడవటమే''.

''ఇప్పుడు ఏమంటావు?''

''ఇంకో సంవత్సరం సమయం వుంది. నేను అన్ని రకాలుగా ఆలోచిస్తాను. మిత్రుల అభిప్రాయాలు తెలుసుకుంటాను. చూద్దాం''.

''నిరంజన్ గారు అడిగితే ఏం చెప్పమంటావు?''

''ఇన్ ప్రిన్సిపల్ ఓ.కె. నాన్నా. అప్పటికి పరిస్థితులు ఎలా వుంటాయో మనకు తెలియదు. మనమే కాదు నిరంజన్ గారు కూడా మీ వాడు చదువుకుంటే బెటర్ అనవచ్చు. చూద్దాం. అయినా నిరంజన్ గారికి మీ మీద ఇంత శ్రద్ధ ఎందుకు కలిగింది''.

''నాకు తెలియదు. నేను తనని కూడా అడగలేదు''.

''మంచిది నాన్నా. ఇంతే కదా... ఇంకేమన్నా మాట్లాడాలా?''

''ఇంత వరకే'' అన్నాడు వెంకటాద్రి.

కొన్ని నెలలు గడిచిపోయాయి.

శివకృష్ణ దగ్గరకు కారులో వచ్చాడు వెంకటాద్రి. డ్రైవర్ వున్నాడు. శివ ఇంకా పూర్తిగా తేరుకోలేదు. వాకర్ తో చిన్న చిన్న అడుగులు వేస్తున్నాడు.

''నువ్వు డ్రైవింగ్ నేర్చుకుంటే బాగుండేదేమో వెంకూ''.

''అనుకున్నాను. అయితే నేను మాత్రం డ్రైవింగ్ చేయదలుచుకోలేదు. మొత్తం మీద నేర్చుకుంటాను. అంత వరకే''.

''కారు తీసుకున్నావా?''

"కంపెనీ కారు యిచ్చింది. డ్రైవర్ ని యిచ్చింది. శాలరీ వారే పే చేస్తారు. అలాగే ఇల్లు వారిది. ఆ రకంగా చూసినప్పుడు అన్నీ నిరంజన్ చూసుకుంటున్నాడు".

"నువ్వు అదృష్టవంతుడివి వెంకూ... మొదట్లో నువ్వు రకరకాల ప్రశ్నలు అడుగుతుండేవాడివి. ఒక్కోసారి చిన్న పిల్లల ప్రశ్నల్లా నాకు అనిపించేవి. అంతలోనే అనుకునేవాడ్ని. మనకి ఎంత వయసు వచ్చినా అలా పిల్లల్లా వుండగలగటం ఎంత గొప్ప విషయం అని. నువ్వు నీకు డబ్బులు దొరికాయా ఎప్పుడన్నా అన్నావు. నేను అంటాను నిరంజన్ లాంటి గాడ్ ఫాధర్ దొరకటం అదృష్టం అని. అంటే అందరికీ అలాంటి ఇండస్ట్రియలిస్టులు దొరకకపోవచ్చు 'ఏ రంగంలో వారికి ఆ రంగంలో అలాంటి వాళ్లు దొరకాలి'.

"అర్థం అయింది శివా!"

"ఇప్పుడు నాకూ వెతుక్కోవాలనిపిస్తోంది".

"ఏంటది. డబ్బు అయితే కాదు కదా!"

"ఇప్పుడు మనం చూసిన రాళ్ల గుట్టలన్నీ దేవకన్యలుగా మారిపోయారనుకో. నిన్ను మేం లవ్ చేస్తున్నాం. నిన్ను మా లోకానికి తీసుకుపోతాం. నువ్వు, మాలో ఒకర్నయినా, నలుగుర్నయినా ఎన్నుకో. ప్రేమ ప్రపంచంలో విహరిద్దాం అన్నారనుకో. అలాగే నీకు డబ్బు కావాలా అయితే నీ కోసం ఓ బంగారు కొండనే ఇవ్వగలం అంటే... " అని ఆగాడు.

వెంకటాద్రి శివనే చూస్తున్నాడు.

"అప్పుడు ఇవేవీ వద్దు. నాకు మంచి ఆరోగ్యం ఇవ్వండి. అంతకుమించి  నాకు ఏమీ వద్దు అంటాను. మనం ఏం చేయాలన్నా ముందు ఆరోగ్యం వుండాలి. అది ఒప్పుకుంటావా? చివరకి పగ సాధించాలన్నా కూడా".

"నేను ఒప్పుకునేదేముంది. ప్రపంచంలో ఏ మనిషయినా అంగీకరించాల్సిందే" అన్నాడు వెంకటాద్రి.

"మనకి ఆరోగ్యం బాగున్నంత కాలమే ప్రేమ గురించి, పుస్తకాల గురించి. ఇంకా ఆధ్యాత్మికత గురించి, విప్లవాల గురించి మాట్లాడతాం. ఆ ధీమా వుంటుంది. మనకి అహంకారాలుంటాయి. అసలు మనం మన కోసం కాకుండా దేశంలోని మనుషుల కోసం బతుకుతున్నాం అనుకుంటాం. ఎంత భ్రమ. ఎంత మాయ".

"నువ్వు వేదాంతంలోకి జారిపోతున్నావా?"

"ఇది వేదాంతం కాదు. వాస్తవం. సరే ఇంకేంటి విశేషాలు?"

"కొత్తగా ఏమీ లేవు. నిన్ను కలవటం కుదరటం లేదు".

"నాదే ముందిలే. ఒకటి గుర్తుంచుకో. నిరంజన్ తో తగాదా తెచ్చుకోవద్దు".

"ఏ విషయంలో అలాంటిది వస్తుంది?" అన్నాడు వెంకటాద్రి.

"ఎన్ని దశాబ్దాలు కలిసి స్నేహంగా వున్నా, ఏ నిముషంలో అయినా చిన్న మాట దగ్గర తేడాలు వస్తుంటాయి. అప్పటిదాకా ఎదుటి వారు మనకు చేసిన సహాయం అను, మంచీ గుర్తు రాదు. అలాగే వారికి వీళ్లు ఇన్ని సంవత్సరాలు

మనకు ఇంత సేవ చేశారు అనేది గుర్తుకు రాదు. బయటివారే కాదు... స్వంత మనుషులు కూడా అలానే విడిపోతుంటారు''.

''నువ్వు చెప్పినవి గుర్తుంచుకుంటాను. అలాగే నీకు ఎలాంటి సహాయం కావలసి వచ్చినా నీ వెంకుని అడగటానికి ఎలాంటి మొహమాటం వద్దు. బహుశా మేం చెన్నైకి షిఫ్ట్ అవ్వొచ్చు''.

''అదెప్పుడు?''

''చెబుతాను'' అన్నాడు వెంకటాద్రి.

శివతో మాట్లాడాక వెంకటాద్రికి తన బతుకుని సమీక్షించుకోవాలని అనిపించింది. అంతకు ముందు డైరీ రాసుకునేవాడు. డబ్బులు దొరికిన దగ్గర నుండి అది మానేయటం జరిగింది. ఇప్పటికి చాలా మార్పులు జరిగాయి. నిరంజన్ తో బంధం బలపడింది. తను యిచ్చిన డబ్బుకి చెంది అన్నీ ఆడిటర్ సరి చేశాడు. ఇప్పుడు తనది పదిపైసల వాటా. అదేం చిన్న విషయం కాదు.

అదలా వుంటే తన ప్రేమ విషయం గుర్తు వచ్చింది. తన అమ్మా నాన్నలు కాస్త మొరటుగా వుండేవారు. వారు బతికినంత కాలం అద్దె ఇంటిలో వున్నారు. ఎందుకో ఇల్లు కట్టాలని అనిపించలేదు వారికి. ఆ డబ్బుని పొలం కొనటానికి పెట్టుబడి పెట్టారు. మొదట్లో అర ఎకరం భూమి మాత్రం వుండేది. దాన్ని నాలుగు ఎకరాలు చేశారు. అమ్మ మాత్రం అనేది...

''నీకు ఇల్లు ఇవ్వలేకపోయాం నాయనా!'' అని.

''చదువు చెప్పించారు కదా'' అనేవాడు వెంకటాద్రి.

అందుకోసం పల్లెటూరు నుండి పట్నం పంపించారు. కామర్స్ గ్రాడ్యుయేట్. అప్పట్లో ఓ అమ్మాయిని ఇష్టపడ్డాడు. ఆమె గురించి తెలియదు. పది మంది మధ్యలో వుండేది. అందరూ ఆడపిల్లలే. మొదటి సారి చూసినప్పుడు తనకు తెలియకుండానే ఆ అమ్మాయంటే ఓ ఆకర్షణకి లోనయ్యాడు.

రాత్రులు నిద్రపట్టేవి కాదు.

ఆ అమ్మాయిని తనతో పాటు కాలేజ్ లో చదివే మరి కొంత మంది కూడా ప్రేమించారు. మిత్రులు కాలేజ్ ఆవరణలో విడిగా కూర్చున్నప్పుడు ఎవరి ప్రేమల గురించి వారు చెప్పుకునేవారు. వెంకటాద్రి మాత్రం సైలెంట్ గా వుండేవాడు. ఆ అమ్మాయి పేరు ధీరజ. తన గురించి తర్వాత కొన్ని విషయాలు తెలిసాయి.

వాళ్ల నాన్న బ్రాహ్మణుడు. ఓ చాకలి అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అందుకని కుటుంబాలు వెలేశాయి. వారిద్దరికి పుట్టిన అమ్మాయి ధీరజ. మంచి రంగు. గొప్ప అందంగా వుండేది. నిజానికి ధీరజని ప్రేమించిన వారి కంటే మోహించిన వారు ఎక్కువ మంది.

ఆ అమ్మాయితో మాట్లాడటానికి ధైర్యం చాల్లేదు వెంకటాద్రికి. అందులోనూ ఆ అమ్మాయి విషయంలో కాలేజ్ లో కుర్రాళ్లు గొడవ పడ్డారు. తలలు కూడా బద్దలు కొట్టుకున్నారు. బాగా డబ్బున్న వారి అబ్బాయిలూ, కులం బలం వున్న వారు ఎదురెదురుగా నిలబడ్డారు.

ధీరజ మనసేంటో ఎవరికీ తెలియదు.

తలదించుకుని కాలేజ్ కి వచ్చేది. మంచి మార్కులు వచ్చేవి. వెంకటాద్రి ఓ గదిలో ఇద్దరు మిత్రులతో వుండేవాడు. అతను అంతకు ముందు ఫర్వాలేదు. నెంబర్ వన్ స్టూడెంట్ మాత్రం కాదు. అంతకు ముందు ఎక్కడ చదివిందో గాని ధీరజ ఆ సంవత్సరం అక్కడికి వచ్చింది. అక్కడ నుండి చదువు మీద శ్రద్ధ తగ్గిపోయింది.

అత్యంత విషాదం ఏమిటంటే వాళ్ల నాన్న ప్రమాదంలో చనిపోవటం. అది ప్రమాదం కాదు. కావాలని చంపేశారు అనుకున్నారు. ధీరజ చదువు మానేసింది. వాళ్లమ్మతో ఆ ఊరు వదిలి వెళ్లిపోయింది.

అలా ధీరజ ఓ కల. ఓ జ్ఞాపకం.

ఆమె ఆచూకీ తెలుస్తుందని కొన్ని ప్రయత్నాలు చేశాడు. ఎవరూ చెప్పలేకపోయారు. తర్వాత అనుకునేవాడు. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానంటే అమ్మానాన్నలు ఒప్పుకునేవారా అని. ఏం జరిగేదో తెలియదు.

ఆ తర్వాత వెంకటాద్రి ఇంకో అమ్మాయిని ప్రేమించలేదు. తన చదువు పూర్తి కాగానే ఉద్యోగం వచ్చింది. రెండు సంవత్సరాలు టెంపరరీగా పని చేశాడు. తర్వాత రెగ్యులర్ అయింది. కళ్యాణితో వివాహం జరిగిపోయింది. అందుకే శివ ప్రేమ గురించి మాట్లాడుతున్నా తనది ప్రేమగా చెప్పటానికి సందేహం.

ఇప్పుడు తమ పిల్లలు అలాంటి భావనకి గురయితే అనే ఆలోచన వస్తుంటుంది. అది వేరే కులం వారయితే తను అంగీకరించగలుగుతాడా? ఏమో... తన ముందు రెండు ఆప్షన్ లున్నాయి. అందులో నిరంజన్ కూతురు మీద కనిపించని ఆశ. అలాగే ఆనందరావు కూతురు. ఈ విషయంలో కళ్యాణి మనసుని తెలుసుకోవాలి. తనకు మేనకోడలి మీద ప్రేమ వుండవచ్చు. స్వంత మనిషయితే బాగా చూసుకుంటుంది అనుకోవచ్చు. అందుకని ఆదిత్య మీద తన ప్రభావం చూపించవచ్చు అనిపించింది.

ఆనందరావు అత్తగారికి ట్రీట్ మెంట్ జరుగుతోంది. అది గుంటూరులోనే. వాళ్లు యిబ్బందులు పడుతున్నారు. ఆనందరావు పెద్ద కూతురు హైదరాబాద్ వచ్చింది. తమ ఇంట్లోనే వుంటోంది. ఆదిత్య చివరి సంవత్సరంలోకి ప్రవేశించాడు.

బెంగళూరులో మొదటి వెంచర్ విజయవంతం అయింది. అందులో కన్ స్ట్రక్షన్స్ నిరంజన్ తీసుకోలేదు. డెవలప్ చేసి ఇంటి స్థలాలుగా అమ్మేశారు. అందులో నాలుగు ప్లాట్స్ అట్టి పెట్టుకున్నారు.

మరో వెంచర్ ని చూస్తున్నాడు.

చూస్తుండగా కాలం గడిచిపోయింది.

ఆదిత్య ఇంజనీరింగ్ పూర్తి అయింది. అప్పుడు నిర్ణయం తీసుకోవలసిన అవసరం వచ్చింది. ఈ సారి నిరంజన్, వెంకటాద్రి, ఆదిత్య ముగ్గురూ సమావేశం అయ్యారు.

ఆదిత్య చదువు ఆపేయటానికి నిర్ణయం తీసుకున్నాడు. తను కొత్తగా ఓ ప్రాజెక్ట్ రిపోర్ట్ ని తయారు చేసుకుని వచ్చాడు. అది నిరంజన్ స్టడీ చేస్తానని చెప్పాడు. ముందుగా చెన్నై ఫ్యాక్టరీని పూర్తిగా ఆదిత్య చూసుకోవాలని అన్నాడు. అందుకు అంగీకారం జరిగిపోయింది.

అలాగే వెంకటాద్రి వాళ్లను చెన్నై పంపించటమా, వద్దా అనే విషయంలో ఆలోచించుదాం అనుకున్నారు. బెంగళూరులోనూ కన్ స్ట్రక్షన్ మొదలు పెడుతున్నారు. అక్కడకి తరచుగా వెళ్లాల్సి వుంటుంది. అందుకని ఓ డెసిషన్ కి రాలేకపోయారు. ఆదిత్యకి భోజనానికి యిబ్బంది లేదు. అందులోనూ బెంగళూరు హాస్టల్ కి అలవాటు పడివున్నాడు.

నిరంజన్ తో సమావేశం అయ్యాక ఇంట్లో అందరూ సమావేశం అయ్యారు. ఇప్పుడు దీప్తిది సమస్య. తను ఇంజనీరింగ్ కంప్లీట్ చేయాలి. బెంగళూరులో వుంచుదామా? హైదరాబాద్ కి తీసుకువద్దామా అని అనుకున్నారు.

"మళ్లీ ఇక్కడికి ఎందుకు. నేను బెంగళూరులోనే ఇంజనీరింగ్ పూర్తి చేస్తాను" అంది దీప్తి.

"ఇంతకు ముందు అన్నయ్య కూడా వున్నాడు అనే ధైర్యం వుండేది. మీరు ఇద్దరూ విడివిడిగానే వున్నా అవసరానికి కలుసుకోవచ్చు అనే భరోసా వుండేది" అంది కళ్యాణి.

"మళ్లీ ఇక్కడికి మారటం అంటే కాలేజ్ లో సీట్ దొరకాలి. మళ్లీ డొనేషన్లు అంటారు. అవన్నీ ఎందుకమ్మా, రెండు సంవత్సరాల్లో చదువు అయిపోతుంది" అంది దీప్తి.

"అవన్నీ నిరంజన్ గారు చూసుకుంటారు".

"ఎవరు చూసుకున్నా ఖర్చు ఖర్చేగా. అయినా కొత్త వాతావరణం. మీరు కూడా హైదరాబాద్ లో వుంటారని గ్యారంటీ లేదు కదా".

"అదయితే నిజమే" అన్నాడు వెంకటాద్రి.

"నా అభిప్రాయం అయితే దీప్తిని బెంగళూరులో వుంచటమే మంచిది" అన్నాడు ఆదిత్య.

అప్పుడు ఆనందరావు పెద్ద అమ్మాయి సమస్య వచ్చింది.

"తను కూడా హాస్టల్ లో వుండి చదువుకుంటే బెటర్. మీరు ఇక్కడ ఎప్పుడుంటారో, ఎప్పుడు వెళ్తారో తెలియనప్పుడు తనకి సమస్య అవుతుంది".

"ఇంజనీరింగ్ చేయాలని తనకు లేదు గ్రాడ్యుయేషన్ చేస్తాను అంటోంది. తను కంప్యూటర్స్ అంటే ఇష్టపడుతోంది" అంది కళ్యాణి.

"మంచిదే. ఎవరు ఏది చదువుకోవాలంటే అది చదువుకోవచ్చు" అంది దీప్తి. అందరి మాటలూ సైలెంట్ గా వింటున్నాడు వెంకటాద్రి.

అతనికి నిరంజన్ దీప్తి ఇంజనీరింగ్ అయిపోయాక తన ఫర్మ్ లోకి తీసుకుంటాడు అనిపిస్తోంది. సివిల్ ఇంజనీర్ల అవసరం తనకు వుంది. అలా అని ఆ విషయాన్ని ఇప్పుడు మాట్లాడదలుచుకోలేదు. ఇంట్లో అందరూ ఒకే దగ్గర వుండటం మంచిదేనా అనే సందేహం వస్తోంది.

అయితే పిల్లల గురించిన ఎలాంటి భయాలు లేవు. వారు ఎలాంటి పరిస్థితినయినా ఎదుర్కోగలరు అన్న ధైర్యం వచ్చేసింది. ఇప్పుడు అతని మనసులో వుంది మాత్రం పెళ్లి. దీప్తికి ఇంకో రెండు సంవత్సరాలుంది. అయినా ఇప్పటి నుంచి అనుకోవాలి–తన ఆలోచనలు ఎంత భిన్నంగా వున్నా కూడా.

అంతకు మించి చర్చ జరగలేదు.

ఆ రోజు నిరంజన్ ఏదో ఆలోచనలో వున్నాడు.

అతని ఎదురుగా వెంకటాద్రి వున్నాడు. ఓ అయిదు నిముషాలు గడిచిపోయాయి.

"విజేత ఇంజనీరింగ్ గాని, మెడిసిన్ గాని చేయను అంటోంది వెంకూ" అన్నాడు నిరంజన్.

"కంప్యూటర్స్ ఇష్టపడుతోందా. ఆర్కిటెక్చర్ చెందిన కోర్సుల్లో చేరతాను అంటోందా?"

"కాదు. ఫిలాసఫి చేస్తానంటోంది".

వెంకటాద్రి ఆశ్చర్యపోయాడు.

"తను ఈ మాట అన్నప్పుడు నాకు ఆశ్చర్యం కలిగింది. నా తర్వాత ఈ ఫ్యాక్టరీలు, వ్యాపారాలు తను చూసుకుంటుందని సహజంగా అనుకుంటాం కదా. తనకు ఇలాంటి ఆలోచన ఎందుకు వచ్చిందో అర్థం కావటం లేదు".

"మీరు ఇంజనీరింగ్ గాని ఎం.బీ.ఎ. గాని చేయించాలనుకున్నారా?"

"అవును. స్వర్ణకి మాత్రం కూతుర్ని డాక్టర్ గా చూసుకోవాలని వుంది. అయినా మనం అనుకున్నవి జరగవు. ఇప్పుడనిపిస్తోంది. ఇవన్నీ అవసరమా అని. ఇన్ని పరుగులు ఎందుకని? నా వారసురాలికే ఇంట్రెస్ట్ లేనప్పుడు ఈ వ్యాపారాలన్నీ తగ్గించుకుంటే పోలా అనుకుంటున్నాను".

"అమ్మాయికి నచ్చ చెప్పండి".

"లేదు లేదు. నేనూ స్వర్ణా మాట్లాడాం. మా అభిప్రాయాలు చెప్పాం. తను ఈ విషయంలో సీరియస్ గా వుంది".

"అయినా కూడా నిరాశ ఎందుకు నిరంజన్ గారూ... రేపు అమ్మాయికి పెళ్లి చేయాలి. అప్పుడు అల్లుడ్ని మీరు ఎన్నుకుంటారు. అతను ఇవన్నీ చూసుకుంటాడు".

"వెంకూ...మనం చెప్పిన వ్యక్తిని పెళ్లి చేసుకుంటుందని నమ్మకం ఏంటి? అసలు నాకు పెళ్లి వద్దు అన్నా ఆశ్చర్యం లేదు".

"అలా అంటుందని నేను అనుకోను. ఒక్కరినే ఎందుకు కన్నారు అని మిమ్మల్ని అడిగిందని అన్నారు".

"అది నిజమే. అప్పటి అభిప్రాయం అది. నిజంగా మనం కొన్ని తప్పులు చేస్తుంటాం. విజేత అన్నది నిజం. ఒకరినే కనటం మేం చేసిన తప్పు. ఇంకొకరిని కనాల్సింది" అన్నాడు బాధగా.

"ఫిలాసఫి చదివినంత మాత్రాన పెళ్లి చేసుకోరు అనటానికి లేదు. ఇప్పుడే మీరు అలాంటి అభిప్రాయానికి రావద్దు. అదలా వుంటే రేపు మీకు మనవళ్లు, మనవరాళ్లు వస్తారు. వారి కోసం మీరు సంపాదించాలి. అయినా నాకు తెలిసిన వ్యక్తి అంటారు. ఇంకా మీకు ఎందుకింత తాపత్రయం. సంపాదించింది చాలదా అంటే, ఇది సంపాదించాలనే తాపత్రయం కాదు. ఇంతకంటే నాకు ఏ పనీ చేతకాదు. నన్ను ఇంట్లో కూర్చోమంటే కూర్చోలేను ఇంకా ఓపిక వుంది. ఇప్పుడు లాభ నష్టాలు నా మీద ప్రభావం చూపించలేవు. అంతగా అయితే శారీరకంగా, మానసికంగా అలసిపోయినప్పుడు ఏ క్షణంలో అయినా అన్నింటినీ అమ్మేయటమో మరొకటో చేస్తాను అని".

నిరంజన్ చిన్నగా నవ్వాడు.

వెంకటాద్రికి తన మంచి రోజులన్నీ కరిగిపోతున్నాయా అని అనుమానం లీలగా ప్రవేశించింది ఓ క్షణం. అయినా ఇప్పుడేం జరిగిందని, తను కోరుకున్న జీవితం కంటే మంచి అవకాశాలు వచ్చాయి. ఇప్పుడు సొంతం వెనక్కి వెళ్లటం అంటూ జరగదు. నిరంజన్ ఇవన్నీ తగ్గించుకున్నా, వైండప్ చేసినా తనకు అన్యాయం మాత్రం చేయడు. అలాగే పిల్లలు ఇక్కడ కాకుంటే ఇంకో చోట షైన్ అవుతారు. కాకపోతే నిరంజన్ తో వియ్యం అందుకునే విషయంలో ఇంక ఎలాంటి ఆశలు పెట్టుకోకూడదు. అలా అనుకున్నాక అతనికి తృప్తిగా అనిపించింది.

ఆదిత్య చెన్నై బయలుదేరబోతున్నాడు. అతన్తో కళ్యాణి, వెంకటాద్రి కూడా వెళ్తున్నారు. నిరంజన్ ఆ రోజు వైరాగ్యంతో మాట్లాడినా, నాలుగు రోజుల తర్వాత మామూలుగా మాట్లాడాడు. తమకు బడిలోగాని, కాలేజ్ లో గాని చేర్పించేటప్పుడు వెళ్లటం అలవాటుగా పెట్టుకున్నాం అంటే చెన్నైవారిని వెళ్లమన్నాడు నిరంజన్.

ముందు రోజు నిరంజన్ ఇంటికి వెళ్లారు. దీప్తి కూడా వుంది.

"మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో నాకు తెలియటం లేదు" అన్నాడు వెంకటాద్రి. అలాంటివేం అనుకోవద్దు. ఈ నాలుగు సంవత్సరాలు మనం కలిసి జర్నీ చేశాం. ఇక ముందు కొత్త జనరేషన్ తో చేయబోతున్నాం. ఇంతకు ముందు నేను నీకు బాస్ ని కావచ్చు. ఇప్పుడు మనం భాగస్వాములం అంటున్నప్పుడు ఆదిత్యకి అలా ఎందుకు అంటున్నాడో అర్థం కాలేదు.

ఇంతవరకూ ఇంట్లో ఎవరికీ తన పెట్టుబడి గురించి తెలియదు.

దీప్తి విజేతతో మాట్లాడుతోంది తన గదిలో. తాను ఫిలాసఫి తీసుకోనుందని అప్పుడే తెలిసింది. ఈ అంశం మీద ఎందుకంత ఇంట్రెస్ట్ ఏర్పడింది అని విజేతని అడిగింది. నేను చూస్తున్న మనుషులు. వారిని పూర్తిగా అర్థం చేసుకోవటం కష్టంగా వుంది. మనుషుల మనసుల లోతుల్లోకి వెళ్లాలనిపించింది దీప్తి. అందుకని తీసుకుంటున్నాను. డబ్బులు సంపాదించే కార్యక్రమం నాన్న గారు చూసుకుంటున్నారు. దాంతో ఇప్పుడు నాకు అవసరం లేదు అనుకున్నాను అంది.

"చాలా మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. నేను అనుకోవటం ముందు ముందు మానసిక రోగులు పెరుగుతారు. నాకు ఒకందుకు నువ్వు నచ్చావు".

"ఏ విషయంలో?" నవ్వుతూ అంది విజేత.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS